# 'బెటర్ హాఫ్'

**"నా బెటర్ హాఫ్ ఎలా ఉండాలో నాకు బాగా తెలుసు. మీరు చూపించిన అమ్మాయి మెళ్ళో తాళి కట్టడానికి నేనేమి చంటి పిల్లాడిని కాదు. నాకూ అందరిలా మనసుంది, వయసుంది, రిప్రజెంటేటివ్ ఉద్యోగమూ ఉంది. నా బెటర్ హాఫ్‌ని నేనే సెలక్ట్ చేసుకొంటాను. అందాకా ఆయనగారిని అదే ఆ తాతయ్యగారిని ఆగమనండి టిక్కెట్ బుక్ చేసుకోకుండా.**

"ఆగలేనంటారా? అందుకు నేను చేయగలిగింది ఏమీ లేదు. ఆయనగారి కోసం నా జీవితాన్ని విషాదమయం చేసుకొనే సన్యాసిని కాను. నా ఈ నిర్ణయానికి తిరుగులేదు" గట్టిగా చెప్పేశాడు మధు తన తల్లితండ్రులతో.

"వ్యవహారం అంతవరకు వచ్చాక మేముమాత్రం ఏమంటాం? వయసొచ్చిన పిల్లలు కదా! వింటారేమో, బాగుపడతారని చెప్పి చూస్తాం. వినకుంటే మేమే మీ మాట వింటాం. మీ మార్గం మంచిదని కాదు. పదిమందిలో ఎక్కడ పలుచబడతామోనన్న భయంతో, ఆ పైన వచ్చే మంచిగాని, చెడుగాని మీతోపాటు మేమూ అనుభవించటానికి సిద్ధపడ్డాము" అన్నారు పరంధామయ్యగారు.

కలం స్నేహితులుగా కొనసాగుతున్న వారిలో అందమైన సీరిని ఎన్నుకొని, పోస్టల్ ద్వారా ప్రేమసారాన్ని అందిస్తూ, అందుకుంటూ ముఖాముఖీగా కలుసుకొంటే ఇంకా అడ్వాన్సుగా ఉంటుందని ఓమారు కలుసుకొన్నారు. ఆ క్షణంలోగాని సీరిటోన్ మగసిరిగల టోన్ అని తెలుసుకొని సీరి ముందు యస్ అనలేక సీరియస్ అయిపోయాడు. సీరి వాయస్, తను వధువునెన్నుకొనే విషయంలో మరో ఛాయిస్ నిచ్చిందన్న విషయం అప్పటికిగాని తెలుసుకోలేకపోయాడు.

కలం స్నేహితులలో మరో స్నేహితురాలు శైలజని ఎన్నుకొని, స్నేహాన్ని పెంచుకొంటూ, గత అనుభవాన్ని దృష్టిలో వుంచుకొని అడ్వాన్స్ కాకుండా, అనుమాననివృత్తి ఫోన్ ద్వారా చేసుకొని, పోస్టల్ కోర్సు పూర్తి చేసుకొని అడ్వాన్స్డ్ ప్రోగ్రాంకి అచిరకాలంలోనే అపాయింట్‌మెంట్ బుక్ చేసుకొన్నాడు.

హోటల్ అనుపమ రూమ్ నెంబర్ 303 కాలింగ్ బజ్జరు పిలుపునిచ్చింది. డోర్ ఓపెన్ చేసిన మధు "హలో శైలజగారు వెల్‌కమ్, ఇపుడేనా రావటం. మీ కొఅకే వెయిట్ చేస్తున్నాను. కమాన్" అంటూ దారి యిచ్చి డోర్ లాక్‌చేసి లోపలకు నడిచాడు.

బ్రీఫ్ కేసు టేబుల్‌పై ఉంచి "డియర్ ట్రెయిన్ లేటవటం జర్నీ అనీజీగా ఉన్నది. ఫస్ట్ ప్రెషప్ అవ్వాలి" అంటూ టాయ్‌లెట్‌లోకి దారి తీసింది శైలజ.

అరగంట గడిచాక కాఫీతాగారిరువురూ, మెడలోని మంగళసూత్రాన్ని బయటకు తీసి కళ్ళకద్దుకుంటూ "చూడు డియర్ ఈ మంగళసూత్రం ఎంత బలం గలదో" చూపించింది.

కంగారుపడూ "ఏమిటి శైలజగారూ, మంగళసూత్రమా? మీ మెడలోనా?" అన్నాడు.

"అవును మంగళసూత్రమే. మంగళప్రదమైనది. నా మెడలోనే. కంగారు పడతారెందుకు అలా?" అన్నది.

"నేను కట్టవలసినది నాక్కాబోయే అమ్మాయి మెడలో కనపడ్తుంటే కంగారుకాక యింకేముంటుంది?" జావగారాడు.

"ఈ మాత్రం దానికే ఇలా అయిపోతే ఎలా? ఇల్లు వదలి బైటకు వస్తున్నానని, ఎవరైనా పోకిరీలు వెంటబడ్తారేమోనని నేనే వేసుకొన్నాను. ట్రెయిన్ దిగి వస్తుంటే వెంటబడ్తున్న ఓ పోకిరీకి ఈ తాళి చూపించా. అంతే పరారు. ఇదే నన్ను కాపాడి మీ దగ్గరకు చేర్చింది" హుషారుగా చెప్పింది.

"మీరే వేసుకొన్నారా. బతికించారు నాకా అవకాశాన్ని వుంచారు ఇంకా. ఇక్కడ పోకిరీలెవ్వరూ లేరుగా యింకా మెడలో ఎందుకది. తీసి దాచండి. వెళ్ళేటపుడు వేసుకోవచ్చు."

"ఫరవా లేదు డియర్, ఉండనియ్యి అలా."

"వద్దు. ముందు అది తీసెయ్"

"తీయలేను డియర్"

"ఎందుకని?"

"మీకేమీ తెలియదనుకొంటా. తీశాననుకో డియర్, నన్ను, మిమ్మల్ని ఇలా ఒకే రూమ్‌లో పోలీసులు చూస్తే, అనుమానించి ఇదేదో ఆ బాపతు అని ముద్రవేసి ఇద్దరిని చెరొక గదిలో పడవేస్తే మన సరదా, విషయం ఏమౌతుందో ఆలోచించలేదు గదూ! అసలు మన సరదాకి, విషయానికి తాళి అడ్డం కాదుగా, ఒకవేళ పోలీసులు వచ్చినా భార్యాభర్తలం అంటే నమ్ముతారు. కనుక ఇలాగే ఉండనీయండి".

"వినటానికి చాలా బాగుంది. ఆచరణకే అసాధ్యమైనది. నేను ఇక్కడకెప్పుడొచ్చినా ఈ హోటల్‌లోనే బస చేస్తాను. ఇక్కడ వారందరికి నా గురించి బాగా తెలుసు. మ్యారేజ్ కాలేదని, ఆ ప్రయత్నంలో ఉన్నానని, ఇలా వాళ్ళకంట బడితే ఇంకేమైనా ఉందా? కొంపలంటుకుపోవూ. ఆ తాళి తీసెయ్యండి.

'ఇలాంటి వాటికే కొంపలంటుకుపోయేటట్లయితే అగ్గిపెట్టెల ఫ్యాక్టరీలు, అణుబాంబుల తయారీలు ఆగిపోయేవి. ఆగిపోలేదుగా. లోపల ఉన్నది మనమేగా. మీకు తెలిసిన వాళ్ళెవరైనా వస్తే అపుడు తీసేస్తా డియర్" అన్నది.

"కొత్త వాళ్ళెవరైనా వస్తే అపుడు మెడలో వేసుకొందురు, ముందు అది తీసేయండి. అది ఉండటం వలన మీరు పెళ్ళి అయిన వారన్న భావన నాలో కలిగి ఫ్రీగా మూవ్ కాలేకలేపోతున్నా" అన్నాడు.

"అదా అసలు విషయం. అయినా అందులో ఏముంది మన(సు)లో ఉండాలి. అంతగా మచ్చటపడి చెప్తుంటే కాదనటందేనికి" అంటూ ఆ తాళి తీసి దిండు కింద దాచింది.

"శైలజా ఇపుడు నిన్ను చూస్తుంటే నూటికి నూరు శాతం కుమారివని, నాదానివే అన్న భావన నాలో బలంగా నాటుకుపోతున్నది. కమాన్ చాలా విషయాలు మాట్లాడుకోవాలి. దగ్గరకురా" అంటూ చాలా ముందుకు మూవ్ అయి ఎన్నో కొత్త విషయాలకి మూమెంట్ ఇచ్చి అతని ఎకౌంట్‌లో పేమెంట్ చేశాడు. అతని చొరవకి ఆమె ఉరవడి జతకలిపి అలజడి కల్గించాయి అవయవాలలో.

ప్రయాణపు అలసట తీరాలంటే మజిలీ (విరామం) చాలా అవసరం. ఆ విరామంలో ఎన్నో విషయాలు. ఆ పిమ్మట మరల పయనం. ఇదే అనాదిగా వస్తున్న వైనం. మజిలీలో మ్యారేజ్ ప్రస్తావన చేశాడు మధు.

"తొందరపడకు డియర్. మొదట మా ఇంట్లో వాళ్ళని ఒప్పించాలి. ఆపై మ్యారేజ్. అందాకా ..." అర్థోక్తిలో ఆగింది.


తనువుల కుశల ప్రశ్నలతో మధు కాళ్ళు గీసుకొనటంతో శైలజకింతకు ముందే మ్యారేజ్ అయిందన్న స్థిరనిర్ణయానికొచ్చి, తనను మోసగిస్తున్నదని తెలుసుకొని, "నిజంగా నన్ను ప్రేమిస్తున్నావా ? సూటిగా చూస్తూ" అడిగాడు.

"డియర్ నీ కోసం నా శరీరాన్నే అభిమానంగా ఇచ్చుకున్నాను.

"మరి ! నీ కాళ్ళకు మెట్టెలున్నాయిగా"

అయింది డియర్. ఇప్పుడు నీకొచ్చిన ఇబ్బంది ఏమిటంటావ్ ? నేనెప్పుడూ అందుకు సిద్ధంగా వున్నా కదా ! ఇంకా అనుమానమెందుకు ? ప్రొసీడ్.

ఛివాలున లేచి "నిజమే నీవు సిద్ధమే. నా బెటర్‌హాఫ్‌ని నేనే ముచ్చటగా సెలెక్ట్ చేసుకోవాలనుకొన్నా. నాకు కన్య కావాలి. శ్రీమతి కాదు"




డియర్ ఇంతవరకు వచ్చాక దాచవలసిన అవసరంలేదు. నేను శ్రీమతి శైలజా మనోహర్‌ని. నా భర్త దుబాయ్‌లో జాబ్ చేస్తుంటాడు. ఏ సంవత్సరానికో, సంవత్సరన్నరకో ఇండియా వచ్చి, తను ఇన్నాళ్ళు సంపాదించినదంతా ఒక్కమారు ఇచ్చి వెళ్తుంటాడు. పెళ్ళయి మూడు సంవత్సరాలు అయినా. మేం సంసారం చేసింది బహా తక్కువరోజులు. వయసులో ఉన్నప్పుడు బాగా సంపాదించి, వయసు అయిన తర్వాత కాలు మీద కాలు వేసుకొని సుఖపడాలని వాళ్ళ నాన్న చెప్పారుట. ఆ మాటే వేదంగా భావించి సంపాదనే ముఖ్యమని, ఇంకా ఎవరైనా ఎక్కువ జీతం ఇస్తానంటే ఇంకా పైకి కూడా వెళ్ళామనుకొంటున్నానని ఈ మధ్యనే తెలియజేశారు. వాస్తవానికి వయసు అయిన తర్వాత కాలుమీదకాలువేసుకొని సుఖపడటానికి ఓపికా వుండదు. ఉత్సాహమూ ఉండదు అని ఎంత చెప్పినా విన్పించుకోకుండా అక్కడే కంటిన్యూ అవుతున్నారు. ఆ ఎడారులలోకి నేను వెళ్ళలేను. నాకు ప్రేమించబడాలని వుంటుంది. అందుకే ఈ పెన్‌ఫ్రెండ్‌షిప్ ఎన్నుకున్నా. పదిమందితో పరిచయం పరవశానికి దోహదం. Now I am very happy ఇదిగో బ్రీఫ్‌కేస్ కావలసినంత తీసుకో" అన్నది.

విషయం అర్థమై ఆ గండంనుంచి బయటపడ్డాడు.

* * *

ఈమారు గత రెండు అనుభవాలను దృష్టిలో వుంచుకొని కలం స్నేహితురాలు కన్యను వధువుగా ఎంచుకొని, తన ప్రేమదారిలో తపాలా కోర్సు ద్వారా నడిపించి, హోటల్ అనుపమ రూమ్ నెంబరు 303లో కన్యకొరకు నిరీక్షిస్తున్నాడు.

కాలింగ్‌బెల్ మోగగానే డోర్ ఓపెన్‌చేసి ఎదురుగా వున్న మనిషిని చూసి 'ఓ మీరా ! రండి రండి. కన్య రాలేదేం ? ఎప్పుడొస్తుంది" అన్నాడు.

ఆమె లోపలికి వస్తూ "మధుగారు మీరేనా?" అన్నది.

'అవును' అనగానే కుర్చీలో కూర్చున్నది.

"మిమ్మల్ని చూస్తుంటేనే అర్థమైపోతున్నది. అచ్చం కన్య పోలికలే మీవి. సారీ తల్లిపోలికలు కూతురికొస్తాయంటారు గదా! కన్యకు అచ్చం మీ పోలికలే. ఇన్ని లెటర్సు వ్రాసింది కాని ఏనాడూ తను మీ పోలికని వ్రాయలేదేం ? రేపు కన్య కూడా పెద్దదైతే అచ్చం మీలాగే వుంటుందని స్పష్టంగా తెలుస్తోంది. సరే అన్ని విషయాలు కన్య సమక్షంలోనే మాట్లాడాలనుకున్నా. కన్యను షార్ప్‌నైన్‌కి రమ్మని, కొంచెం సమయం యిరువురం జంటగా కలిసి ఎన్నో విషయాలు మాట్లాడుకోవాలని, అన్నింటిలో ఒక్కటి కావాలని, మ్యారేజ్ విషయం మీతో మాట్లాడాలని ఎంతగా చెప్పానో ఆంటీ, ఇంతవరకు రాలేదు. పది అవుతున్నది. ఎపుడొస్తుందో ? ఏమో. ఎక్కడికెళ్ళింది. ముందు మీరొచ్చేశారే. అవునులెండి మీకున్న ఇంట్రస్టు మీ అమ్మాయికెందుకుంటుంది. మీకు మీ అమ్మాయి భవిష్యత్తు చాలా ముఖ్యం కదా ! మీ అమ్మాయికా ఆలోచన ఎక్కడుంటుంది. అందినవాడెక్కడికీ పోడులే అన్న ధీమా తప్ప తొందర ఎందుకు వుంటుంది.

ఇంత తొందర మనిషితో ఎలా మాట్లాడాలా ? అన్నట్లు ఎటో చూస్తున్నది.

"కన్య గురించి ఆలోచించకండి. మళ్ళీ ఆర్డరిస్తాగా. మరీ కాఫీ తీసుకోండి" అంటూ చేతికందించి కన్య కొరకు డోర్‌వైపు నడిచాడు. అక్కడే అటు, ఇటు పచార్లు చేస్తున్నాడు.

కాఫీ తాగి మ్యాగజైన్సు చూస్తున్న ఆంటీ 'మిస్టర్ మధూ' అని పిలిచింది.

హడావుడిగా వచ్చి "ఏమిటి ఆంటీ కన్యనెక్కడికైనా పంపించారా ? టైం, రూమ్ వృధా అయిపోతున్నాయి. అనుకున్నప్రకారం తొమ్మిది గంటలకే వచ్చి వుంటే ఈసరికి చాలాపనులు పూర్తయ్యేవి. కన్య వస్తుందంటారా ? రాదంటారా ? అడిగాడు.

ఆంటీ అతని అవస్థ చూసి కళ్ళు తుడుచుకుంటూ "ఇలాంటి పరిస్థితి వస్తుందని అనుకోలేదు. బాధపడకు" ఓదార్పుగా మాట్లాడింది.

"కన్యకేమైంది ? ఎన్ని ఆశలు పెట్టుకున్నానో ? ఎన్ని కలలు కన్నానో ? నేను కోరుకున్న లక్షణాలన్నీ మూర్తీభవించిన కన్నెపిల్ల నా కన్య. పెళ్ళి చేసుకోవాలనుకున్నానే. ఈ అవకాశం కూడా చేజారిపోయిందా. అయ్యో భగవంతుడా ఎంత పని జరిగింది" రోదిస్తున్నాడు.

"నిజంగా పెళ్ళి చేసుకొంటావా మధూ" అన్నది ఆంటీ.

"నన్నే అనుమానిస్తున్నారా ఆంటీ. అమ్మా, నాన్నలు చూసిన సంబంధం కాదని కన్యనే సెలక్ట్ చేసుకొన్నవాణ్ణి. అనుమానించకండి, నా కన్యను చూపించండి."

"చూపించక తప్పదా? అన్నమాట మీద నిలబడగలవా?"

"చూడండి. ఇప్పుడు భూమి మీద నిలబడ్డానా? కన్యను చూసినతర్వాత మాట మీద నిలబడ్డానని ఋజువు చేసుకొంటా."

"భూమిమీద అందరూ నిలబడతారు ఇంకెక్కడా నిలబడే అవకాశం లేక మాటమీద నిలబడినవారే అరుదు"

"కొంచెం సేపటిలో మీకే తెలుస్తుంది నా నిజాయితీ ఏమిటో?"

"సరే ఇంతగా చెప్తున్నావు కనుక నిన్ను నమ్ముతున్నాను. అలాగని నట్టేట ముంచవు గదా!"

"నట్టేట ముంచటం మా ఇంటా, వంటా లేదు. మునగటమే మా వంశాచారం. మా ముత్తాత అమ్మాయి అందంగా ఉందంటే కట్నం ఎదురిచ్చి చేసుకొన్నాడంట. గుణం మంచిది కాదుట. మా తాత ఈ అనుభవంతో అందగత్తె వద్దని అందవికారిని చేసుకొన్నాడుట. ఎంత పిలిచినా పలికేది కాదుట. మూగదిలే అనుకొన్నాడుట. క్రమేపీ తెలిసిందట బ్రహ్మచెముడు కూడా ఉందని. ఇప్పటికైనా అర్థమైందా మా వంశమెటువంటిదో?"

"అర్థమైంది. హమ్మయ్య కన్యజీవితం గురించి నాకే దిగులు లేదు. మంచివాళ్ళ ఇంట్లోనే పడుతోంది.అదృష్టవంతురాలు. నేనే నీ కన్యని డియర్" అనటంతో అంతవరకు నిలబడ్డ మధు కూలబడ్డాడు. జగ్‌లోని నీళ్ళు ముఖం మీద చల్లింది. తెప్పరిల్లుకుని కళ్ళు తెరుస్తూ ! నా కన్యవు నీవా? నా బెటర్‌హాఫ్‌వు నీవా?" అంటూ మళ్ళీ స్పృహ కోల్పోయాడు.

భుజం పట్టుకుని బెడ్‌మీదకి చేర్చింది. మళ్ళీ నీళ్ళు చల్లింది. కొంతసేపటికి తేరుకొని పైకి చూస్తుంటే" డియర్ నేను ముందే చెప్పాను.ఇంకా నీకు నమ్మకం కుదరకుంటే ఇవిగో నీవు వ్రాసిన ప్రేమలేఖలు, నేను రాసిన లేఖల కాపీలు" బ్రీఫ్‌కేసులోంచి తీసి చూపించింది.

బెడ్ మీద నుంచి మెల్లగా లేచి కూర్చొని" ఇంకా నమ్మకం కుదరకపోవటమేమిటి ఆంటీ. నా రోగమే కుదిరింది. అవును మరి సంవత్సరం క్రితం వచ్చిన మ్యాగజైన్‌లో పెన్‌ఫ్రెండ్‌షిప్ కాలమ్‌లో మీ ఫోటో —"అనుమానంగా అడిగాడు.

"అదా! నాకు పదిమందితో ఫ్రెండ్‌షిప్ చేయాలని చిన్ననాటి నుంచి మహా ఉబలాటంగా ఉండేది. ఆర్థిక పరిస్థితులు అనుమతించేవి కావు. ఇంతకాలానికి ఆర్థిక పరిస్థితుల నుంచి బయటపడ్డాను. ఇప్పటి ఫోటో పంపితే ఎవరు స్నేహం చేస్తారు. కావాలనే చిన్నప్పటి ఆ ఫోటో పంపించాను."

"మరి వయసు ఇరవై సంవత్సరాలు అని ఇచ్చారు."

"ఆ ఫోటో ఇరవై సంవత్సరాల వయసుదే. నేనూహించినట్లుగా ఎవరూ నాతో స్నేహం చేయటానికి ఎవరూ ముందుకు రాలేదు. నిరుత్సాహపడుతున్న తరుణంలో నీ లెటరు వచ్చి ఆనందాన్ని నింపింది. ఉత్తరాలు విపరీతంగా వ్రాసేదానిని. నీవూ చొరవ తీసుకొని నాలో అడుగంటిన ఆశల్ని వెలికి తీసుకొచ్చావు. ఇంతకాలానికి నా జీవితానికో తోడు దొరికినందుకు ఎంతగానో మురిసిపోయాను. పెళ్ళి చేసుకుందామని నువ్వు వ్రాస్తే పెళ్ళి అయినంతగా భావించా. ఈ కన్య నీ సొంతం. నీటముంచినా పాలముంచినా నీదేభారం.

"భారం కాదు. ఆంటీ నాదే ఘోరం.

"నాబొంద. నా ముఖానికి ఆలోచించటం కూడానా? ఏనాడో మండిపోయింది. ఏది మంచో, ఏది చెడో, ఎవరు కన్నెపిల్ల, ఎవరు ముసలిపిల్లో తెలుసుకోలేకపోయా. ఇలాంటి నన్ను చేసుకొని నువ్వేం సుఖపడ్తావ్? పిచ్చిపిచ్చి ఆశలు పెట్టుకొని మనసును కష్టపెట్టక, నష్టాలపాల్జేయకు. వెంటనే వెళ్ళి హాయిగా ఇప్పటివరకు ఎలా గడిపావో అలాగే గడిపేటందుకు కృషి చెయ్యి. అలవాటుపడ్డ జీవితం ఆనందాన్నిస్తుందంటారు. పెళ్ళి గురించి లేనిపోని ఆశలు పెంచుకోకు. అది నీలాంటి వాళ్ళకి, నాలాంటి వాళ్ళకి అబ్బి వచ్చేది కాదులే. నేను నీకు సూటబుల్ కానులే."

"పోర్టబుల్ లాంటి మొగుడు సూటబుల్ కాదంటే ఎలా? నేను నీకంటే పెద్ద అని సంకోచిస్తున్నట్లున్నావ్ కదూ! రాముడికంటే సీత పెద్దది కాదా? చేసుకొని జగద్విఖ్యాతిని పొందలేదా. ఆలోచించకు, వెనుకంజ వేయకు."

"వాళ్ళకీ, మనకూ పోలికలేంటి? వాళ్ళు కారణజన్ములు, మనం మారణ జన్ములం. అనవసరంగా ఆలోచించక బయలుదేరింది."

"చేసుకోకపోతే చేసుకోకపోయావ్, కనీసం ఉత్తరాలైనా వ్రాస్తుంటావా?"

"ఎందుకు వ్రాయను?"

"నన్ను మర్చిపోవు కదు మధూ."

"మర్చిపోవటమే, అసంభవం. కన్నవారినైనా మర్చిపోవచ్చేమో కాని, కలం స్నేహాన్నెలా మర్చిపోతాను."

"థాంక్యూ. బైబై" అంటూ బయటకు నడిచింది తన సరంజా మాతో.

బ్రతుకుజీవుడా అనుకొంటూ రూమ్ వెకేట్ చేసి తిరుగుముఖం పట్టాడు. తాతయ్యకు ఎలా మొహం చూపించాలో అర్థం కాలేదు.

•

## జోక్స్




గురునాథం ఇంట్లో అడుగు పెడుతూ వనజాక్షితో ఇలా అన్నాడు. రానురాను నాకు మతిమరుపు ఎక్కువైపోతోంది. ఈరోజు మా ఆఫీసు అనుకుని వేరే ఆఫీసుకు వెళ్ళానే 'అర్థాంగీ'

వనజాక్షి: ఇది మీ 'ఇల్లుకాదు' నేను 'నీభార్యనూ కాదు' మీది పక్కిళ్ళండీ కోపంతో చెప్పింది.

ఎం. సుధ. కాచిగూడ